అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనుల బిల్లులపై ఆరా తీస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

బిల్లులు సమర్పించాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టిన పనుల రికార్డుల పరిశీలన

వికారాబాద్, సెప్టెంబర్ 10 : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనుల బిల్లుల పరిశీలన పూర్తి చేసి సమర్పించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ ప్రత్యేక అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టిన పనుల రికార్డుల పరిశీలనను ప్రత్యేక అధికారులు కలెక్టర్ సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల కింద 924 పాఠశాలలు ఎంపిక చేశామని, ఇప్పటికే 450 పాఠశాలలకు సంబంధించి చెల్లింపులు చేయడం జరిగిందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా పాఠశాల భవనాల మరమ్మతులు, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించిన పనుల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. రికార్డుల పరిశీలన ప్రక్రియను పూర్తి చేసినట్లయితే పాఠశాలల్లో చేపట్టిన పనులకు త్వరలోనే చెల్లింపుల ప్రక్రియ చేపట్టేందుకు వీలుగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంబీ(మెజర్మెంట్ బుక్) రికార్డుల ప్రక్రియను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్‌డీవో శ్రీనివాస్, డీఈవో రేణుకాదేవి, అమ్మ ఆదర్శ పాఠశాల ప్రత్యేక అధికారులు, ఇంజినీర్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టేందుకు బాధ్యత తీసుకోవాలి

ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య పనులు చేపట్టేందుకు బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ జిల్లా మహిళా సమాఖ్య సభ్యులకు సూచించారు. కలెక్టరేట్ ఆవరణలోని స్త్రీ శక్తి భవన్‌లో పాఠశాలల్లో పారిశుధ్య పనులు, అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులు, వరి ధాన్యం సేకరణ కేంద్రాల్లో చెల్లింపుల విషయంపై జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల సభ్యులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ, స్థానిక సంస్థలతో పాటు ఆదర్శ పాఠశాలల నిర్వహణ మెరుగుపరచాలనే ఉద్దేశంతో పారిశుధ్య పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం గ్రామీణ పాఠశాలకు పంచాయతీరాజ్ శాఖ, పట్టణ పాఠశాలకు మున్సిపల్ పరిపాలన శాఖకు బాధ్యతలు అప్పగించడంతో పాఠశాల ఆవరణలో మరుగుదొడ్ల నిర్వహణ, మొక్కలకు నీరు పెట్టడం సమస్యగా మారిందని పేర్కొన్నారు. పాఠశాలల పారిశుధ్యంపై అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీకి పాఠశాలల నిర్వహణ బాధ్యతను అప్పగించాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. దీనికి పాఠశాల కమిటీలు, ప్రధానోపాధ్యాయుల సమన్వయంతో గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సంఘాలు పాఠశాల నిర్వహణ బాధ్యతలను తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను బట్టి ప్రతి నెల రూ.3 వేల నుంచి రూ.20 వేల వరకు పాఠశాలల నిర్వహణ నిమిత్తం చెల్లించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

జిల్లాలో మంజూరైన అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టిన పనులకు పూర్తి చెల్లింపులు చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. పనులు పూర్తయి, ఎంబీ(మెజర్మెంట్ బుక్) రికార్డు పూర్తయిన వారికి తప్పనిసరిగా చెల్లింపులు చేయడం జరుగుతుందని ఆయన హామీ ఇచ్చారు. జిల్లాలో 2021 రబీ నుంచి 5 సీజన్లుగా వరి ధాన్యం సేకరణ కేంద్రాలను నిర్వహించిన మహిళా సంఘాలకు రావలసిన సర్వీస్ చార్జీలకు(కమిషన్) సంబంధించి రూ.2.47 కోట్లు మంజూరు కావడం జరిగిందన్నారు. వీటిని మహిళా సంఘాలకు చెల్లించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించడం జరుగుతుందని, ఆసక్తిగల మహిళలు సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకు రావాలని కలెక్టర్ సూచించారు. సమీక్షా సమావేశంలో డీఆర్డీవో శ్రీనివాస్, ఏపీడీ సరోజ, డీపీఎం రామమూర్తి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అలివేలు, వివిధ మండలాల మహిళా సమాఖ్య సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

రేపు వికారాబాద్‌లో జాబ్ మేళా

వికారాబాద్, సెప్టెంబర్ 10 : అపోలో ఫార్మసీ ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి షేక్ అబ్దూస్ సుభాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో జాబ్ మేళా క్యాంప్ ఈ నెల 12న ఉదయం 10:30 గంటలకు నిర్వహించడం జరుగుతుందన్నారు. అపోలో ఫార్మసీ ప్రైవేటు కంపెనీల్లో సుమారు 100 పోస్టులు ఉన్నాయన్నారు. వీటికి అబ్బాయిలు మాత్రమే అర్హులు కాగా.. బీఫార్మ్, ఎంఫార్మ్(విత్ పీసీఐ/విత్‌ౌట్ పీసీఐ) 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ చదివి ఉండాలన్నారు. ఇతర వివరాలకు జాబ్ మేళా నిర్వాహకుడు మియాసాబ్ 9676047444ను సంప్రదించాలని ఆయన సూచించారు.

చిలుకూరు కాంగ్రెస్ పార్టీలో భగ్గుమన్న వర్గపోరు

పార్టీ పదవులకు రాజీనామా చేసిన నాయకులు

మొయినాబాద్, సెప్టెంబర్ 10 : మండల పరిధిలోని చిలుకూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన వ్యక్తికి మద్దతుగా నిలిచిన వ్యక్తుల మధ్య విభేదాల కారణంగా రెండు గ్రూప్‌లుగా విడిపోయి పార్టీ పదవులకు రాజీనామా చేసే పరిస్థితికి దారితీసింది. మొయినాబాద్ నుంచి చిలుకూరు గ్రామం వరకు ఉన్న రోడ్డు నిర్మాణంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగడంలేదని ఓ సీనియర్ నేత కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు గున్నాల సుధాకర్‌రెడ్డికి, కొంతమంది ముఖ్య నాయకులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అధికారులకు వినతిపత్రం అందించారు. పార్టీకి, ప్రభుత్వానికి సంబంధించిన కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం ఇవ్వకుండా తానే పార్టీలో సీనియర్‌ను అంటూ ఓ ముఖ్య నాయకుడు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని తీవ్ర మనస్థాపం చెందిన గున్నాల సుధాకర్‌రెడ్డితోపాటు మరి కొంత మంది నాయకులు కాంగ్రెస్ పార్టీకి పదవులకు మంగళవారం రాజీనామా చేశారు.

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో విజయలక్ష్మి

చించోడ్ ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో విజయలక్ష్మి

షాద్‌నగర్‌రూరల్, సెప్టెంబర్ 10 : రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో విజయలక్ష్మి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని చించోడ్ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని నిర్వహించగా.. ఆమె ఆసుపత్రి ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఇవ్వాలన్నారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు నెలకు సరిపడా మందులను అందించాలన్నారు. రక్త నమూనాలను జిల్లా కేంద్రంలోని టీహబ్‌కు పంపించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల గ్రామస్తులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం అపరేషన్ డెంగ్యూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్యులు స్రవంతి, సంధ్య, ప్రవీణ్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ల్యాబ్ టెక్నీషియన్ శివ, ఫార్మాసిస్టు ఉదయ్‌కుమార్, ఏఎన్ ఎంలు పాల్గొన్నారు.

హాస్టల్‌లోని వంటవారితో మాట్లాడుతున్న జిల్లా ఉప వైద్యాధికారి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్

చేవెళ్లటౌన్, సెప్టెంబర్ 10 : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్ తెలిపారు. మంగళవారం చేవెళ్లలోని మోడల్ స్కూల్, హాస్టల్‌లోని వంట గది, కూరగాయలు, మరుగుదొడ్లు, తరగతి గదులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కూరగాయలను కడిగాకే వండాలని తెలిపారు. జాగ్రత్తలు పాటించకపోతే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సంతోష్, డాక్టర్ వేదశ్రీ, వైద్య సిబ్బంది, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్ని గుర్తించండి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు హైకోర్టు ఉత్తర్వులు

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తుర్కయాంజాల్(పూర్వం తొర్రూర్) మున్సిపాలిటీలోని సర్వే నం.383లోని 259 ఎకరాల్లో ప్రభుత్వ, ప్రైవేట్లు భూములను గుర్తించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు హైకోర్టు ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు రెండు నెలల గడువు విధించింది. ప్రభుత్వ భూములుగా గుర్తించాక అవి అన్యాక్రాంతం అవ్వకుండా నిషేధిత జాబితాలో చేర్చాలంది. తొర్రూర్ సర్వే నం.383/2లో ప్లాట్ నం.13ను భర్త కానుకగా ఇచ్చిన ప్లాటు రిజిస్ట్రేషన్ చేసేందుకు వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ నిరాకరించడంపై టి.శైలజ హైకోర్టులో సవాలు చేశారు. దీనిని జస్టిస్ ఎన్.వీ.శ్రవణ్ కుమార్ జరిపిన విచారణకు సబ్ రిజిస్ట్రార్ వ్యక్తిగతంగా హాజరయ్యారు. రిజిస్ట్రేషన్ నిరాకరణకు సబ్ రిజిస్ట్రార్ తగిన కారణాలను వివరించలేకపోయారు. కొన్ని భూములను నిషేధిత జాబితాలో నుంచి తొలగించాలని కోరుతూ జిల్లా రిజిస్ట్రార్ 2017లో కలెక్టర్‌కు లేఖ రాశారని, ఇప్పటి వరకు ఏవిధమైన చర్యలు లేవన్నారు. జిల్లా కలెక్టర్ ఈ నెల 4న హైకోర్టు ఎదుట వ్యక్తిగతంగా హాజరై సర్వే నం.383లో 259 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని చెప్పారని తెలిపారు. ఇందులో ఎలాంటి సబ్ డివిజన్ ఏవీ లేవన్నారు. ప్రభుత్వ భూమి గుర్తింపు ప్రక్రియ మొదలైందన్నారు. రెండు నెలల సమయం ఇస్తే ప్రభుత్వ గుర్తింపు పూర్తవుతుందన్నారు. వాదనల తర్వాత హైకోర్టు, సెక్షన్ 221(బి)కి సంబంధించి ప్రభుత్వ భూముల గుర్తింపునకు 2012లో ఇదే హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు అమలు చేయని అధికారులపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. పుష్కర కాలం తర్వాత రెండు నెలల సమయం కావాలని కోరడం సరికాదని మండిపడింది. ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియలో జాప్యం జరిగిన మాట వాస్తవమేనని ప్రభుత్వ న్యాయవాది అంగీకరించారు. దీంతో సదరు సర్వే నంబర్‌లోని భూమి ప్రభుత్వానిదా లేక ప్రైవేటుదా అనేది సర్వే చేసి తేల్చాలని జిల్లా కలెక్టర్‌ను హైకోర్టు ఆదేశించింది. పిటిషనర్‌కు సంబంధించిన స్థలం రిజిస్ట్రేషన్ విషయంలో చట్ట ప్రకారం ముందుకు వెళ్లాలని సబ్ రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. పిటిషన్‌పై విచారణను మూసివేసింది.

ప్రశాంతంగా టీజీ సెట్ పరీక్షలు ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 10 : తెలంగాణ రాష్ట్రంలో అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్ పోస్టులకు అర్హత సాధించేందుకు నిర్వహించే టీజీ సెట్-2024 పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. రోజూ రెండు సెషన్లలో మూడు రోజుల పాటు ఈ పరీక్షలు జరుగనున్నాయి. పరీక్ష ప్రశ్నాపత్రం సెట్‌ను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ విడుదల చేశారు. మొత్తం పరీక్షలకు 33,764 మంది దరఖాస్తు చేసుకున్నారని సెట్ మెంబర్ సెక్రెటరీ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి తెలిపారు. పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 24 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్, యూజీసీ డీన్ ప్రొఫెసర్ మల్లేశం, ఓఎస్డీ ప్రొఫెసర్ రెడ్యానాయక్, ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీనగేశ్, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి, ప్రొఫెసర్లు సయీదా తలత్ సుల్తానా, కరుణసాగర్, చెన్నప్ప, టీజీ సెట్ మాజీ మెంబర్ సెక్రెటరీలు ప్రొఫెసర్ రాజేశ్వర్‌రెడ్డి, ప్రొఫెసర్ నకులారెడ్డి, ప్రొఫెసర్ యాదగిరిస్వామి, ప్రొఫెసర్ యాదవరావు, ప్రొఫెసర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీసీఏ రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 10 : ఓయూ పరిధిలోని బీసీఏ పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీసీఏ రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి ఈ నెల 17వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 19వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 17వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

ఎంఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 10 : ఓయూ పరిధిలోని ఎంఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి, రెండు, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును ఈ నెల 19వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో 26వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

తాండూరులో నేడు వినాయక నిమజ్జనం

వినాయకులను నిమజ్జనం చేసే కోకట్ వాగును పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి, సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్

- డీజేలకు అనుమతులు లేవు
- మద్యంతాగి వాహనాలు నడిపితే కేసులు
- చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు
- 350 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు
- వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

తాండూరు, సెప్టెంబర్ 10 : వినాయక ఉత్సవాలు తాండూరు నియోజకవర్గంలో వైభవంగా కొనసాగుతున్నాయి. తాండూరు పట్టణంలో ప్రతిష్ఠించిన వినాయకులను బుధవారం నిమజ్జనం చేయనున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను హిందూ ఉత్సవ కేంద్ర సమితితోపాటు ప్రభుత్వ శాఖల అధికారులు, పోలీస్ యంత్రాంగం ముమ్మరంగా ఏర్పాట్లను చేస్తున్నది. ముఖ్యంగా పట్టణంలోని భద్రేశ్వరచౌక్‌లో హిందూ ఉత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో గణపయ్యలకు ఘనంగా స్వాగతం పలికేందుకు వేదికను ఏర్పాటు చేయగా.. పాత తాండూరు గడి సమీపంలో హిందూ, ముస్లింలు ఐక్యతను చాటుతూ నిమజ్జన ఉత్సవాలు నిర్వహించేందుకు ప్రత్యేక స్టేజీ ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డితో పాటు పట్టణ పుర ప్రముఖులు పాల్గొంటారని హిందూ ఉత్సవ కేంద్ర సమితి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సింహులు తెలిపారు. మధ్యాహ్నం నుంచే వినాయకుల శోభాయాత్రను ప్రారంభించి కోకట్ వాగులో నిమజ్జనం చేయాలని సూచించారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లన్నీ చేశామన్నారు.

శాంతియుతంగా నిమజ్జనం చేయాలి

తాండూరులో బుధవారం నిర్వహించే గణపతి నిమజ్జన మహోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఎస్పీ నారాయణరెడ్డి, తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం తాండూరు పట్టణంలోని వినాయక మండపాలతో పాటు నిమజ్జన స్థలమైన కోకట్ వాగును పరిశీలించారు. సామూహిక వినాయక నిమజ్జనం శాంతియుతంగా నిర్వహించాలని అందుకు పోలీస్ శాఖ నుంచి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. 350 మందికి పైగా పోలీస్ సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. పలు చోట్ల ప్రత్యేక సీసీ కెమరాలను ఏర్పాటు చేశామన్నారు. మధ్యాహ్నం నుంచి నిమజ్జనం ప్రారంభించాలని సూచించారు. ట్రాఫిక్‌లో వాహనాలు ఇరుక్కుపోకుండా కండిషన్‌లో ఉన్న వాహనాల్లోనే వినాయకులను నిమజ్జనానికి తీసుకెళ్లాలన్నారు. డీజేలు, భారీ సౌండ్ బాక్సులకు అనుమతులు లేవన్నారు. మత్తు పానీయాలు తీసుకోకుండా పట్టణ, పరిసర ప్రాంతాల్లో మద్యం దుకాణాలను మూసివేయాలని సూచించారు. మద్యంతాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిమజ్జన స్థలమైన కోకట్ వాగులో శాంతియుత వాతావరణంలో వినాయక నిమజ్జనం జరిగేందుకు రాజకీయ పార్టీల నేతలు, కులసంఘాల ప్రతినిధులు కులమతాలకు అతీతంగా అందరూ సహకరించాలని కోరారు. మున్సిపల్, విద్యుత్, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ సిబ్బంది తమతమ విధులను బాధ్యతతో పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, హిందూ ఉత్సవ కేంద్ర సమితి ప్రతినిధులున్నారు.

మంబాపూర్‌లో కోట్‌పల్లి ప్రాజెక్టు కాలువను ఆక్రమించుకొని నిర్మిస్తున్న భవనం

కాలువలపై నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

ఇరిగేషన్ ఏఈఈ మాధురీలత

పెద్దేముల్, సెప్టెంబర్ 10 : ఇరిగేషన్ స్థలాన్ని, కోట్‌పల్లి ప్రాజెక్టు కాలువల స్థలాన్ని ఆక్రమించుకొని భవన నిర్మాణాలను చేపడితే కఠిన చర్యలు తప్పవని ఇరిగేషన్ ఏఈఈ మాధురీలత హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని మంబాపూర్ గ్రామంలో కొందరు కోట్‌పల్లి ప్రాజెక్టు కాలువను ఆక్రమించుకొని మదర్సా నిర్మాణం చేపడుతున్నారని గ్రామస్తులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై మంగళవారం ఏఈఈ మాధురీలత గ్రామాన్ని సందర్శించి మదర్సా నిర్మాణ పనులను పరిశీలించారు. ఈమేరకు కొలతలను తీసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఈఈ మాట్లాడుతూ.. కోట్‌పల్లి ప్రాజెక్టు కాలువను ఆక్రమించుకొని భవన నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించామన్నారు. ఇది కోట్‌పల్లి ప్రాజెక్టు కాలువకు సంబంధించిన స్థలమని తేల్చినట్లు చేపట్టారు. అందులో భవన నిర్మాణాలు చేపట్టడానికి వీలులేదన్నారు. కోట్‌పల్లి ప్రాజెక్టు కాలువలోనే నిర్మాణం చేపట్టారని, ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నట్లు ఆమె తెలిపారు. మదర్సా నిర్మాణానికి పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు లేవని పంచాయతీ కార్యదర్శి సంజీవ్ కుమార్ తెలిపారు. అనుమతి పత్రాలు ఉన్నట్లయితే వికారాబాద్ ఇరిగేషన్ కార్యాలయానికి తీసుకొచ్చి చూపించాలని నిర్మాణదారులకు చెప్పామని మాధురీలత తెలిపారు. నిర్మాణానికి సంబంధించిన వివరాలు పరిశీలించాక తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు. కాలువలను ఎవరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినా వారిపై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

జడ్పీహెచ్‌ఎస్‌లోని వంటగదిని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్

జడ్పీహెచ్‌ఎస్ సందర్శన

- వంట గది అపరిశుభ్రతపై ఆగ్రహం
- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి
- సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్

తాండూరు రూరల్, సెప్టెంబర్ 10 : కరణ్‌కోట పాఠశాల గదుల అస్తవ్యస్తం, వంటి గది అపరిశుభ్రతపై సబ్ కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం తాండూరు మండలం, కరణ్‌కోట జడ్పీహెచ్ ఎస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగదిని పరిశీలించారు. ఆహార పదార్థాలు, వంట సామగ్రిని పరిశీలించడంతోపాటు గదిలో అపరిశుభ్రతా వాతావరణాన్ని చూసి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఇలాంటి గదిలో భోజనం వండిపెడితే అనారోగ్యం బారిన పడతారన్నారు. భోజనంలో నాణ్యతా లోపం ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా పాఠశాల గదులను, బయట వేసిన తుప్పుబట్టిన ఫర్నిచర్‌ను చూసి విస్తుపోయారు. పాఠశాల ఇలా ఉంటే ఎలా అంటూ అక్కడే ఉన్న ఉపాధ్యాయులను ప్రశ్నించారు. విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని ఆదేశించారు. అదేవిధంగా విద్యార్థులకు అందుతున్న భోజనంపై కూడా ఆరా తీశారు.

మల్లమ్మకు ఇల్లు మంజూరు

పరిగి, సెప్టెంబర్ 10 : ఇల్లు లేక మరుగుదొడ్డిలో సుమారు 8 ఏండేకలగా నివాసముంటున్న పరిగి మండలం చిగురాల్‌పల్లి గ్రామానికి చెందిన ఎర్రోళ్ల మల్లమ్మకు ఇల్లు మంజూరు చేస్తామని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. 15 సంవత్సరాల క్రితం ఇల్లు కూలిపోవడంతో గత 8 సంవత్సరాలుగా మల్లమ్మ స్వచ్ఛ భారత్ కింద నిర్మాణం చేపట్టిన మరుగుదొడ్డిలో ఎర్రోళ్ల మల్లమ్మ నివాసముంటున్నారు. ఈ విషయం మీడియాలో రావడంతో ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించి ఆమెను తక్షణమే ఆదుకుంటామని, అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం కలెక్టర్ ప్రతీక్‌జైన్ చిగురాల్‌పల్లి గ్రామాన్ని సందర్శించి మల్లమ్మను పరామర్శించారు. ఈ సందర్భంగా తనకు ఇల్లు మంజూరు చేయాలని ఆమె జిల్లా కలెక్టర్‌ను కోరగా వెంటనే కావాలంటే రేకుల షెడ్డు వేయిస్తామని, ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం చేయించే ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ మేరకు తక్షణ సహాయంగా రూ.10వేలు కలెక్టర్ అందజేశారు. అలాగే పరిగి ఎస్ఐ సంతోష్‌కుమార్ రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, గ్రామ కార్యదర్శి పాల్గొన్నారు.

యూట్యూబ్ రిపోర్టర్‌పై కేసు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 10 : ఓ వ్యాపారిని బెదిరించి డబ్బులు డిమాండ్ చేసిన ఓ యూట్యూబ్ చానల్ రిపోర్టర్‌ను మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌వోటీ పోలీసుల కథనం ప్రకారం.. మేడ్చల్, కీసర ప్రాంతానికి చెందిన సై యూట్యూబ్ చానల్ రిపోర్టర్ మధుసూదన్‌రెడ్డి ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతపల్లిగూడలోని బిస్లరీ వాటర్ తయారుచేస్తున్న కంపెనీ యజ